సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం | 12 | అక్టోబర్ | 2024

విజయీభవ

- నేడు విజయదశమి
- షమీ పూజకు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్(కరీంనగర్): సకల జగత్తుకు మూలం. త్రిమూర్తులకు శక్తిప్రదాత. త్రిలోకేశ్వరి దుర్గామాత దుష్టశిక్షణ గావించిన రోజున విజయదశమి జరుపుకోవడం ఆనవాయితీ. విజయదశమి వేడుకల్లో భాగంగా శమీ వృక్షాన్ని పూజించడం, వాహన, పనిముట్లకు ఆయుధపూజలు చేయడం సంప్రదాయం. తెలంగాణ ప్రాంతంలో ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకునే అతిపెద్ద పండుగ దసరా. ఈరోజు చేపట్టిన ప్రతీ పనిలో విజయం లభిస్తుందని నమ్మకం. దసరా రోజు సాయంత్రం పాలపిట్టను చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం ఉంది. నేటి దసరాకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.



న్యూస్‌రీల్

గ్రామీణ మహిళల్లో అద్భుత మేధాశక్తి

- ఆర్డీవో రమేశ్



ముస్తాబాద్(సిరిసిల్ల): గ్రామీణ మహిళామూర్తుల్లో అద్భుతమైన మేధాశక్తి ఉందని సిరిసిల్ల ఆర్డీవో రమేశ్ కొనియాడారు. మండలంలోని ఆవునూర్‌కు చెందిన జనపాల లస్మవ్వ పాడిన బతుకమ్మ పాటల 'అవ్వపాడిన సద్దుల బతుకమ్మ' పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఆర్డీవో మాట్లాడుతూ అమ్మ లస్మవ్వ పాడిన పాటలను పుస్తకం వేయించిన శంకరయ్య ఆదర్శప్రాయుడని కొనియాడారు. డాక్టర్ జనపాల శంకరయ్య, ఎస్సై గణేశ్, మాజీ జెడ్పీటీసీ నర్సయ్య, క్రాంతి, రవి, కవులు వెంగల లక్ష్మణ్, వాసరవేణి పర్శరాములు, వంశీ, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చేపూరి బుచ్చయ్య, వెంకటయ్య, ఉమామహేశ్వర్, వినయ్, సతీశ్‌చందర్‌రావు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

కొలువుదీరిన ఏఎంసీ పాలకవర్గం



ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం గురువారం పదవీ బాధ్యతలు చేపట్టింది. తలారి రాణినర్సింలు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. వైస్‌చైర్మన్ వెల్కుల రాంరెడ్డి, డైరెక్టర్లు సంతకాలు చేశారు. ఏఎంసీ కార్యదర్శి హరినాథ్ బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల కో–కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, నాయకులు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, రాజు, మిర్యాల్‌కార్ శ్రీనివాస్, కిషన్‌రావు, కొండల్‌రెడ్డి, అంజన్‌రావు తదితరులు సన్మానించారు.

ఊరు మారింది.. పండుగ తీరు మారింది



సిరిసిల్లలో మానేరుతీరంలో దసరా వేడుకలు(ఫైల్)

- ఆ రోజుల్లో దసరా ఓ ప్రత్యేకం
- బంధువులతో ఇళ్లు కలకలలాడేవి
- పల్లె, పట్టణం సందడిగా మారేది
- గుర్తుచేసుకున్న సీనియర్ సిటిజన్లు

సిరిసిల్ల: దసరా అంటేనే తెలంగాణలో పెద్ద పండుగ. ఏడాదికోసారి జరిగే ఈ వేడుకకు పల్లె.. పట్టణం సందడిగా మారుతాయి. ప్రతీ ఇల్లు బంధువులు, కుటుంబ సభ్యులతో కోలాహలంగా మారుతుంది. దసరా పండుగ వస్తుందని ఊహించుకుంటేనే ఒళ్లు పులకరించేది. పిల్లలకు స్కూల్ సెలవులు.. మహిళలకు బతుకమ్మ పండగ ఆటలు.. మగవారి పండగగా దసరాకు ఓ ప్రత్యేక గుర్తింపు. అయితే ఇదంతా గతం. ఇప్పుడు ప్రపంచీకరణ నేపథ్యంలో చిన్నకుటుంబాలు పెరగడం.. ఉద్యోగం.. ఉపాధి కోసం పిల్లలు విదేశాల్లో స్థిరపడడంతో పండుగల రూపురేఖలు మారిపోయాయి. అయితే నాలుగు దశాబ్దాల కిందట దసరా పండుగ ఎలా ఉండేది.. ఆ రోజుల్లో ఎలా జరిగేది.. అని జిల్లాలోని పలువురిని 'సాక్షి' శుక్రవారం పలకరిస్తే.. ఆనాటి సంగతులు గుర్తు చేసుకుని పులకించిపోయారు. దసరా పండగ పూట.. వారి అనుభూతులు ఇవీ..

పుట్టింటికొస్తే సంతోషమే వేరు



ఎక్కడ ఏ హోదాలో పనిచేసినా పుట్టింటికొస్తే ఆ సంతోషమే వేరు. బతుకమ్మ, దసరా పండగకు మా పుట్టిల్లు సిరిసిల్లకు వచ్చాను. చాలా సంతోషంగా ఉంది. అందరూ బంధువులు కలిశారు. నిత్యం ఎంతో బిజీగా సాగిపోయే జీవితంలో పండుగలు ఆత్మీయులను కలుపుతాయి. మా చిన్నతనంలో సంతోషంగా పండుగలు జరిగేవి. కాలం మారింది.. పద్ధతులు మారాయి. కానీ మూలాలు మరిచిపోవద్దు.

– గుడ్ల జ్యోతికిరణ్, హైకోర్టు న్యాయవాది, జేపీసీ నాయకురాలు

పులకించిపోయేటోళ్లం



నిజంగానే పండగ అంటే.. ఆనాటి సంతోషాలు ఇప్పుడు లేవు. మా చిన్నప్పుడు పండుగ చాలా గొప్పగా జరిగేది. ఆత్మీయుల మధ్య పిండివంటలతో సందడిగా ఉండేది. దసరా పూట జంబీ(బంగారం) పెట్టుకుని ఆత్మీయతను పంచుకునేవాళ్లం. ఊరంతా స్నేహితులతో కలిసి తిరిగేవాళ్లం. ఇప్పుడు అంతా సెల్‌ఫోన్ యుగమైపోయింది. మన పండగల ప్రత్యేకత మరుగునపడుతుంది.

– పులి లక్ష్మీపతిగౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, స్తంభంపల్లి

వరసలతో పిలిచేవాళ్లం



మాది రుద్రంగి. మా చిన్నతనంలో దసరా పండగ అంటే ఎంతో గొప్పగా జరిగేది. చుట్టాలు వచ్చేవారు. స్నేహితులు కలిసేవారు. కులమతాలకు అతీతంగా ఊరిలో వరసలు పెట్టుకుని పిలుచుకుంటూ.. ఇల్లిల్లూ తిరిగి జంబీ ఆకును పెట్టుకుని ఆలింగనంతో ఆత్మీయతను పంచుకునేది. ఇప్పుడు పాలపిట్ట లేదు. వాటి కోసం పల్లె పరిసరాల్లో తిరుగుడు లేదు. అన్నింటితోపాటు పండుగల్లోనూ మార్పు వచ్చింది.

– మాడిశెట్టి ఆనందం, సీనియర్ నాయకులు, రుద్రంగి

ఎదురుచూసేటోళ్లం



మా చిన్నతనంలో దసరా పండుగ కోసం ఎదురుచూసేటోళ్లం. ఎందుకంటే ఆ పండుగకు కొత్తబట్టలు కుట్టించేవారు. ఆ రోజుల్లో బంధువులు కుటుంబ సభ్యులు కలిసి ఆప్యాయంగా ఆనంద వాతావరణంలో పండుగ నిర్వహించుకునేది. కానీ ప్రస్తుతం పండుగలు కృత్రిమంగా మారాయి. అప్పట్లో మద్యం, మాంసానికి అంతగా ప్రాధాన్యత ఉండేది కాదు. ఇప్పుడు ప్రతి పండుగకు మద్యం తప్పనిసరిగా మారింది. సంప్రదాయాన్ని నిలపాలి. – కటకం మృత్యుంజయం, మాజీ ఎమ్మెల్యే

ఆ ఆత్మీయతలే వేరు



ఆ రోజుల్లో దసరా పండుగ అంటే ఎంతో ఉత్సాహంగా సాగేది. కుటుంబ సభ్యులతోపాటు ఊరిలోని అందరం కలిసేది దసరా పండుగకే. దూరపు బంధువులు, ఎక్కడెక్కడో స్థిరపడిన స్నేహితులు సిరిసిల్లకు వచ్చేది ఈ పండగ రోజే. ఆత్మీయ పలకరింపులతో.. ఎంతో ఉత్సాహంగా ఉండేది. ఇప్పుడు అంతా కృత్రిమంగా మారింది. ఆనాటి ఆ ఆత్మీయతలు ఇప్పుడు లేవు.

– గుడ్ల శంకరయ్య, మాజీ కౌన్సిలర్, సిరిసిల్ల

సంబురంగా ఉండేది



మాది ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల. మా చిన్నతనంలో ఊరిలో దసరా పండుగ అంటే.. యాటపిల్ల(గొర్రె)ను కొట్టడం, జమ్మిచెట్టు వద్దకు వెళ్లడం, కోలాటం ఆడుతూ.. జడలు వేసి.. విప్పుతూ.. ఎంతో సంబురంగా ఉండేది. ఇప్పుడు ఆనాటి ఆత్మీయతలేదు. బతుకమ్మ పండుగకు దాండియా ఆడుతూ.. పండగ విశిష్టతను దెబ్బతీస్తున్నారు.

– కట్ట నర్సింహారెడ్డి, రిటైర్డు హెచ్‌ఎం, వల్లంపట్ల

మూలవాగులో స్నానాలు చేసేవాళ్లం



మా చిన్నతనంలో మా తాత, నాయిన, తమ్ముండ్లతో కలిసి వెళ్లి మూలవాగులో స్నానాలు చేసి వచ్చేది. దుర్గమ్మకు మొక్కి, వాడకట్టు పెద్దలతో కలిసి యాటపోతు జల్తా పట్టేది. ఎడ్లబండ్లతో జమ్మిచెట్టు చుట్టూ తిరిగేది. మా తాత మల్లయ్యతో దేవున్ని దర్శించుకుని పాలపిట్టను చూసేందుకు వెళ్లేవాళ్లం. జమ్మి ఆకుపెట్టి ఆశీర్వాదం పొందేవాళ్లం. అందరం కలిసి భోజనం చేస్తూ.. సంబురంగా ఉండేది.

– నరాల పోశెట్టి, సీనియర్ నాయకుడు, వేములవాడ

రేషన్‌షాపు ప్రారంభం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌లో రేషన్‌షాపును శుక్రవారం తహసీల్దార్ రామచంద్రం ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఏ రోజుకారోజు నిత్యావసరాల పట్టికను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతీ నెలలో నిర్ణీత సమయం ప్రకారం బియ్యం పంపిణీ చేయాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సబేరాబేగం, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండాటి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పాడిపంటలు బాగుండాలి

వేములవాడ: పాడిపంటలు బాగుండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆకాంక్షించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేములవాడలోని ప్రధాన వీధులు, జంబిచెట్టు గద్దె, ప్రధాన కూడళ్ల నుంచి ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు.



ఎడ్లబండిపై ర్యాలీగా వెళ్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కుటుంబీకులు

కనులపండువగా తెప్పోత్సవం



తిలకిస్తున్న భక్తులు



ధర్మగుండంలో విహరిస్తున్న అమ్మవారు

వేములవాడ: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి తెప్పోత్సవం శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ధర్మగుండంలో మూడు ప్రదక్షిణలు చేశారు. ఏఈవో బి.శ్రీనివాస్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్ పాల్గొన్నారు.

కొత్తగా రెండు పోలింగ్ కేంద్రాలు

- మూడు పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పులు
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో పెరిగిన ఓటర్ల సంఖ్యను అనుగుణంగా కొత్తగా రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వేములవాడ నియోజకవర్గంలో రెండు పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజకీయ పక్షాలతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, లొకేషన్ మార్పులు, ఓటర్ల జాబితా తయారీపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తర్వాత సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలో మార్పులు లేవన్నారు. మొత్తం 287 స్కూల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులు దృష్టి సారించాలని, ఈనెల 29న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేస్తామని, అభ్యంతరాలను, నూతన ఓటర్ నమోదు దరఖాస్తులను నవంబర్ 29 వరకు స్వీకరిస్తామని వెల్లడించారు. డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటర్ జాబితా ప్రచురిస్తామని కలెక్టర్ తెలిపారు. వేములవాడ, సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్, రమేశ్, రాజకీయ నాయకులు గజభీంకార్ రాజన్న, రమేశ్, రేగుల కనకయ్య, సంపత్, అహ్మద్‌ఖాన్, రహీం, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

- ఆటల పోటీలతో మానసికోల్లాసం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ట్రోఫీ అందిస్తున్న ఆది శ్రీనివాస్, జిందం కళ

సిరిసిల్లటౌన్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. క్రీడలతో పోటీతత్వం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలంటే తనకు అమితాసక్తి అని, తాను కూడా వాలీబాల్ ఆడేవాడినని గుర్తు చేసుకున్నారు. యువత సన్మార్గంలో నడిచి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొలనూర్‌లో విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన పునుగోటి మనోహర్‌రావు(45)కు వాటర్‌ట్యాంకర్ ఉంది. శుక్రవారం సాయంత్రం వాటర్‌ట్యాంకర్ ఎక్కి నీరు తీస్తుండగా పైనున్న విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. కోనరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య సుష్మ, కూతుళ్లు సిరి, సంజన ఉన్నారు.

వ్యభిచార నిర్వాహకుడి రిమాండ్

వేములవాడ/వేములవాడఅర్బన్: వేములవాడలోని అయ్యప్పకాలనీ ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఒకరిని, ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం వివరాలు. నెల్లూరుకు చెందిన మల్లె రత్నయ్య వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఓ మహిళను వేములవాడకు రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఆ ఇంటిపై దాడి చేయగా.. ఆ ఇంట్లో కండోమ్ ప్యాకెట్లు, బెడ్ షీట్లు, రూ.2వేల నగదు సీజ్ చేశామన్నారు. సదరు మహిళను సఖీ సెంటర్‌కు తరలించి, నిర్వాహకుడు రత్నయ్యను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. వేములవాడలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

సాగు, పశుపోషణలో అతివలు

- 70 శాతం మందికి పైగా వ్యవసాయంలోనే.. • కుటుంబాలకు ఆర్థికంగా అండ • ఆదర్శం.. వీర్నపల్లి మండల మహిళలు

వీర్నపల్లి(సిరిసిల్ల): పురుషులు ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్ దేశాలకు వెళ్తుంటే.. మహిళలు కూరగాయలు పండిస్తూ, పశుపోషణ ద్వారా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల అతివలు. మండలంలో 17 గ్రామాలుంటే 70 శాతానికి పైగా మహిళలు వ్యవసాయ, అనుబంధ పనుల్లో నిమగ్నమవుతున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ వారి భవితను బంగారుమయం చేస్తున్నారు. విత్తనాలు విత్తడం మొదలు పంటలు చేతికొచ్చే వరకు, పాడిపశువులకు పశుగ్రాసం సేకరణ నుంచి పాలు పితికి, పాల కేంద్రాలకు సరఫరా చేయడం వరకు అన్ని పనుల్లో వారే ఉంటున్నారు. ఆర్థిక వృద్ధి సాధిస్తూ ఆడపిల్లల పెళ్లిళ్లకు కీలక పాత్ర పోషిస్తున్నారు. గిరిజన మహిళల్లో దాదాపు అందరూ ఇలాంటి బాధ్యతలు చూస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న గిరిజన యువతి భూక్యాతండాకు చెందిన లకావత్ శిరీష. భర్త శ్రీనివాస్ సహాయంతో పాడిపరిశ్రమ నిర్వహిస్తోంది. వీరికి 7 ఆవులు, 4 గేదెలు ఉన్నాయి. ఎకరం పొలంలో జీవాల కోసం గడ్డిని పెంచుతున్నారు. పాల విక్రయం ద్వారా అన్ని ఖర్చులూ పోను నెలకు రూ.25 వేల వరకు ఆదాయం వస్తుంది.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న గిరిజన మహిళా రైతు బావుసింగ్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని గోల్యానాయక్‌తండాకు చెందిన బట్టు మంగమ్మ. ఈమె భర్త హరిచంద్ విదేశాలకు వెళ్లి, అక్కడ పని దొరక్కపోవడంతో స్వగ్రామం తిరిగొచ్చాడు. తమకున్న ఎకరం భూమిలో రకరకాల కూరగాయలు సాగు చేసి, భర్త సహాయంతో వాటిని విక్రయిస్తోంది. నలుగురు పిల్లలను ఉన్నత చదువులు చదివించానని సంతోషంగా చెబుతోంది.

మాతృభూమి కోసం పని చేసే సంస్థ ఆర్‌ఎస్‌ఎస్

- విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న వక్తలు

కరీంనగర్‌టౌన్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభమై 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంలో ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ శాఖ పథ సంచాలన్ (రూట్ మార్చ్) కార్యక్రమం, విజయదశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సెంట్ అల్ఫోన్స్ స్కూల్లో జరిగిన కార్యక్రమానికి విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మాతృభూమి సేవ కోసం ఉద్భవించిన సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. దేశం, సమాజం కోసం స్వయం సేవకుల స్వచ్ఛంద త్యాగం, తపస్సు, అంకితభావంతో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించిందన్నారు. నాగపూర్‌లో పదిమంది చిన్నపిల్లలతో ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్ నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. కార్యక్రమంలో సంక్షేమ ట్రస్టు బల్మూరి కర్ణాకర్‌రావు, ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు డాక్టర్ రమణాచారి, జిల్లా సంఘచాలక్ నిరంజనచారి, హన్మండ్ల శ్రీనివాస్‌రెడ్డి, స్వయం సేవకులు పాల్గొన్నారు.

జిల్లాలో చిరుజల్లులు



తంగళ్లపల్లిలో నేలవాలిన వరిపంట

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం చిరుజల్లులు పడ్డాయి. ఇల్లంతకుంటలో అత్యధికంగా 15.2 మిల్లీమీటర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 0.8, చందుర్తిలో 1.1, వేములవాడరూరల్‌లో 3.6, బోయినపల్లిలో 1.8, వేములవాడలో 8.5, సిరిసిల్లలో 7.6, కోనరావుపేటలో 4.2, వీర్నపల్లిలో 2.1, ఎల్లారెడ్డిపేటలో 0.8, గంభీరావుపేటలో 0.5, ముస్తాబాద్‌లో 1.5, తంగళ్లపల్లిలో 14.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

నేలకొరిగిన వరిపంట

ఇల్లంతకుంట(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని వరిపంట నేలవాలింది. చేతికొచ్చిన పంట నేలవాలడంతో కోయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చేదశలో అకాల వర్షాలతో నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తోడు ఈదురు గాలులకు వరిపంట పెద్ద ఎత్తున దెబ్బతిందని పలువురు రైతులు వాపోయారు. అకాల వర్షంతో చేతికి అందే పంట నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.



బతుకమ్మతో డాక్టర్ శ్రావణి

కామాక్షి ఆసుపత్రిలో బతుకమ్మ వేడుకలు

కరీంనగర్‌టౌన్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా శుక్రవారం కరీంనగర్‌లోని కామాక్షి ఆసుపత్రిలో బతుకమ్మ సంబురాలను వైద్యులు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్యురాలు బి.శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న దేవస్థానంలో పూర్ణాహుతి



వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి శుక్రవారం శ్రీరాజరాజేశ్వరీ దేవి సిద్ధిదా అవతారంలో దర్శనమిచ్చారు. స్థానాచార్యుడు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అమ్మవారికి పూజలు చేశారు. నాగిరెడ్డి మండపంలో పూర్ణాహుతి జరిపారు. రాజన్నను 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు.

అవ్వ నేను వస్తున్నా..

- బెంగటీలకు.. రంది పడకు..
- తల్లి సత్తవ్వకు వెంకట్‌రెడ్డి ఫోన్‌కాల్

సాక్షి స్పందన



వృద్ధురాలు సత్తవ్వ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కొడుకును చూడాలన్న ఆ తల్లి పడుతున్న తాపత్రయం ఫలించింది. తల్లిని చూసేందుకు వస్తున్నానంటూ ఫోన్‌చేశాడు ఆ కొడుకు. ఆ వృద్ధురాలైన తల్లి తాళ్ల సత్తవ్వ పడుతున్న వేదనను 'సాక్షి'లో 'కొడుకా.. నీ జాడెక్కడ?' కథనాన్ని ప్రచురించింది. దీనిపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించి ఎల్లారెడ్డిపేట మండల అధికారులను ఆ వృద్ధురాలి ఇంటికి పంపించి ఆమె పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లి పడుతున్న వేదన ఆ కొడుకును కదిలించింది. గత ఆరేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్న కొడుకు వెంకట్‌రెడ్డి శుక్రవారం తల్లికి ఫోన్ చేసి మాట్లాడాడు. 'అవ్వ నేను వస్తున్నా.. బాధ పడకు.. బెంగ పడకు..' అంటూ భరోసాగా మాట్లాడాడు. పక్కనున్న వ్యక్తులతో మాట్లాడి తన తల్లిని బాగా చూసుకోవాలని మరో మూడు రోజుల్లో ఇంటికొస్తానని చెప్పాడు. కొడుకు ఫోన్ చేయడంతో ఆ తల్లి భావోద్వేగానికి గురైంది. సంతోషంలో కంటతడి పెట్టింది.

తిరుపతిలో చిన్నారి భరతనాట్యం

- బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన



తిరుపతి బ్రహ్మోత్సవాల్లో చిన్నారి అక్షయ

ఎల్లారెడ్డిపేట: తిరుమల-తిరుపతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాడవీధుల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్తి కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేటకు చెందిన చిన్నారి భరతనాట్యం ప్రదర్శన ఇచ్చింది. మండల కేంద్రానికి చెందిన సద్ది రాజిరెడ్డి-స్వప్న దంపతుల కూతురు అక్షయ రాష్ట్ర బృందంతోపాటు కలిసి పాల్గొంది.

చికిత్స పొందుతూ హెచ్‌ఎం మృతి



సుహాసిని (ఫైల్)

వేములవాడ: వేములవాడ ఉర్దూ మీడియం హైస్కూల్ హెచ్‌ఎం సుహాసిని(55) చికిత్స పొందుతూ మృతిచెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ సాయినగర్‌కు చెందిన సుహాసిని-పవన్ కుమార్ దంపతులిద్దరూ ఉపాధ్యాయులే. వీరికి ఒక కూతురు, కమారుడు ఉన్నారు. కూతురికి వివాహం చేశారు. పవన్‌కుమార్ కరోనా సెకండ్‌వేవ్ సమయంలో చనిపోయారు. సుహాసిని అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. కాగా, వీరి కుమారుడి పెళ్లి వచ్చే నెలలో చేసేందుకు నిశ్చయించారు. ఇంతలోనే సుహాసిని మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రావు, కృష్ణవేణి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధ్యాపకులు పరామర్శించారు.

ఖండాంతరాల్లో సద్దుల సంబరాలు



ఒమన్‌లో బతుకమ్మ వేడుకల్లో ఆడపడచులు





ఆస్ట్రేలియాలో సద్దుల బతుకమ్మ సంబరాల్లో ప్రవాస తెలంగాణవాసులు

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: ఖండాంతరాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఆస్ట్రేలియాలో నవభారత్ యువ సంఘ్, ఒమన్‌లో తెలంగాణ సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటేలా నిర్వహించారు. ఆస్ట్రేలియాలో సంఘ్ ప్రెసిడెంట్ సుశాంత్, సుతారి శ్రీనివాస్, తోట ఫణికుమార్, సుతారి మధుకర్, బూర్ల సుమన్, రాజన్న, ఒమన్‌లోని మస్కట్‌లో కొండేటి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఒమన్‌లో..

నిరుద్యోగుల గొంతుకనవుతా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



ఓటరు నమోదు ప్రారంభిస్తున్న డాక్టర్ చింతోజు శంకర్, ప్రసన్న హరికృష్ణ

ముస్తాబాద్(సిరిసిల్ల): ఓటుతోనే ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రాన్ని ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ చింతోజు శంకర్ శుక్రవారం ప్రారంభించారు. ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ కరీంనగర్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రులందరు తప్పకుండా ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. 10 లక్షల మంది పట్టభద్రులు ఉండగా కేవలం లక్షన్నర మంది మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. నవంబర్ 6లోగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. శాసనమండలిలో నిరుద్యోగుల గొంతుక అవుతానన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఎల్లమ్మల లక్ష్మణ్, చంద్రం, స్వామిగౌడ్, రాజేందర్, రాజు, ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

సన్మానం



దేవదాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన దేవదాస్ ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగం సాధించగా.. స్థానిక నాయకులు శుక్రవారం సన్మానించారు. శాలువా కప్పారు. న్యాయవాది వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ లీగల్ సెల్ కొండాపురం వెంకటరెడ్డి, గ్రామస్తులు ముత్యాల దీపక్‌రెడ్డి, మొద్దు ప్రశాంత్ ఉన్నారు.